క్లుప్తంగా

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

ముద్దనూరు : పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం ఆయన స్టేషన్‌ను పరిశీలించి కేసులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. సమావేశంలో సీఐ దస్తగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని శ్రీనివాస హాలు ప్రాంతం, ప్రభుత్వాసుపత్రి వెనుక వైపు ప్రాంతాలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలోని 11 కె.వి. ప్రభుత్వాసుపత్రి ఫీడర్ కింద చెట్ల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోండి

లింగాల : మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సత్యవతమ్మ తెలిపారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఇంగ్లీషు మీడియంలో ప్రవేశాల కొరకు బాలుర, బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక ఉంటుదని, అర్హులైన విద్యార్థులు ఈనెల 3వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కొరకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు సర్వసాధారణం

తొండూరు : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు, పదవీ విరమణలు సహజమని మండల వ్యవసాయాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఏఓ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన ఏఓ మధుసూదనరెడ్డిని స్థానిక సిబ్బంది సన్మానించారు.

కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజుల దోపిడీ

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బత్తల అరుణ్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు జి.వలరాజు, నాసర్, సాయికుమార్‌లపై పోలీస్ దాడిని ఖండిస్తూ కడప నగరంలోని శ్రీచైతన్య విద్యా సంస్థల ఎదుట గురువారం ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆందోళన చేపట్టారు. అరుణ్ మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యా సంస్థల్లో అడ్మిషన్స్, పుస్తకాలు, టై, బెల్ట్, షూస్ పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల యాజమానులు 90 శాతం పైగా ఎన్డీఏ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల వ్యాపారాన్ని జిల్లా అధికారులు అరికట్టాలన్నారు. అకీరానందన్, అశోక్, రాజేష్, సాగర్, అభిరామ్ పాల్గొన్నారు

కడప కార్పొరేషన్ సమావేశానికి పటిష్ట బందోబస్తు

కడప అర్బన్: కడప మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం(20వ తేదీన) జరిగే సర్వసభ్య సమావేశానికి పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇద్దరు డీఎస్పీలు, 12మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, 53 మంది ఏఎస్ఐ/హెచ్‌సీలు, 110 మంది కానిస్టేబుళ్లు, నాలుగురు స్పెషల్ పార్టీలు బందోబస్తు విధుల్లో ఉంటారని కడప డీఎస్పీ వివరించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్ కెమెరా, నేత్రా, వజ్ర వాహనం ద్వారా నిఘా ఉంచుతామని తెలిపారు. ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

సొంత మండలాల్లో నియమించాలి

కడప ఎడ్యుకేషన్: 2025–26 విద్యా సంవత్సరంలో ఎంటీఎస్‌పై ప్రభుత్వం నియమించిన 1998, 2008 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను వారి సొంత మండలాల్లోనే నియమించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నటు ఉపాధ్యాయులను దూర ప్రాంతంలో నియమించడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులున్న ఉపాధ్యాయులను సొంత మండలంలో పాఠశాలలకు ఇచ్చేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

20న రెవెన్యూ దినోత్సవం

కడప కోటిరెడ్డి సర్కిల్: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని ఏపీజేఏసీ అమరావతి వైఎస్సార్ కడప జిల్లా చైర్మన్ జీవన చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీలు కృష్ణ కుమార్, రొనాల్డ్ శ్యామూల్ తెలిపారు. విలేకరులతో గురువారం వారు మాట్లాడుతూ ఈ నెల 20వ రెవెన్యూ దినోత్సవం నిర్వహిస్తున్నామని, ప్రతి రెవెన్యూ ఉద్యోగి, అధికారి పాల్గొని వేడుక ఘనంగా నిర్వహించాలని కోరారు.

అన్నదాత అప్రమత్తత లేకుంటే అంతే..

- వర్షాకాలం విద్యుత్ స్టాటర్ బాక్స్‌ల వద్ద అప్రమత్తత ఎంతో అవసరం
- నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణానికే ముప్పు
- చిన్నపాటి జాగ్రత్తలతో ప్రమాదాలకు అడ్డుకట్ట


రైతు పొలంలో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ స్టాటర్


ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

సింహాద్రిపురం : దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు పంటల సాగులో భాగంగా పొలాలకు నీరు పెట్టడానికి వెళ్తూ పొరపాటున విద్యుత్ ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. మరికొంత మంది రైతులు స్వయంగా మరమ్మతులు చేసేందుకు ప్రయత్నించి ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే పొలాల్లో తెగిపడిన విద్యుత్ తీగలు, కిందకు వేలాడుతున్న తీగలవల్ల కూడా ప్రమాదాలు జరుగుతుంటాయి. వర్షాకాలంలో రైతులకు విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇళ్ల వద్ద, పంట పొలాల్లో విద్యుత్ వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఖరీఫ్ సీజన్‌లో విద్యుత్, బోరు బావులు, వాగుల వద్ద రైతులు విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి పంటలు సాగు చేస్తారు. విద్యుత్ వినియోగంలో ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో ఈదురు గాలులు ఎక్కువగా వీస్తుంటాయి. అలాంటి సమయంలో జీవాలను మేత కోసం తీసుకెళ్లేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

విద్యుత్ ప్రమాదాలలో మూడింటికే పరిహారం

విద్యుత్ సంస్థలు కేవలం మూడు రకాల ప్రమాదాలకు మాత్రమే నష్టపరిహారం అందిస్తాయి. మనుషులు, పశువులు మరణిస్తే సాయం అందుతుంది. గాయాలకు పరిహారం ఉండదు. మనుషులకు అయితే రూ.5 లక్షలు, పశువులకైతే రూ.40వేలు, ఒక్కో మేక, గొర్రెలకు రూ.7వేల చొప్పున నష్ట పరిహారం చెల్లిస్తారు. ప్రమాదం జరిగిన స్థలంలోని చిత్రం, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, శవ పంచనామా పత్రాలను విద్యుత్ అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. పశువులకైతే ఫొటోతోపాటు పశు వైద్యుడి పోస్టుమార్టం నివేదికను విద్యుత్ అధికారులకు అందించాల్సి ఉంటుంది.

నష్టపరిహారం ఇలా

ఆకస్మాత్తుగా విద్యుత్ తీగలు తెగి కింద పడినప్పుడు అవి తగిలి మనుషులు, పశువులు మరణిస్తే నష్టపరిహారం ఇస్తారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉన్నప్పుడు వాటికి తగిలి చనిపోతే నష్టపరిహారం అందుతుంది. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడితే నష్ట పరిహారం ఇస్తారు.

విద్యుత్ ప్రమాదాలు ఇలా

వర్షాకాలంలో ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపోవడం, స్తంభాలు విరిగిపోయి కరెంటు సరఫరా అవుతుండటంతో పశువులు, ప్రజలు విద్యుద్ఘాతానికి గురై మృతి చెందుతున్నారు. రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లినప్పుడు అక్కడ సరైన వైరింగ్ లేక ఏమరుపాటుతో ప్రమాదాల బారిన పడుతున్నారు. డిస్ట్రిబ్యూషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనుమతి లేకుండా ఫ్యూజులు మార్చే సందర్భంలో కరెంటు సరఫరా కావడంతో పలువురు చనిపోయిన ఘటనలూ ఉన్నాయి. సర్వీస్ వైర్లు, వీధి దీపాలను సరిచేసేందుకు విద్యుత్ స్తంభాలు ఎక్కినప్పుడు కరెంటు సరఫరా జరిగి మృతి చెందిన సందర్భాలు ఉన్నాయి.

ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

విద్యుత్ పనులు సొంతంగా చేసుకోకూడదు. తడిచేతితో విద్యుత్ పరికరాలు ముట్టుకోకూడదు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు పోతే కరెంటు ఉండదని మరమ్మతులు చేయకూడదు. మోటార్లను నేలపై కాకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గద్దెలపై ఏర్పాటు చేయాలి. స్టార్టర్ బోర్డును తడవకుండా చూడాలి. విద్యుత్ మోటారు పాడైతే మెకానిక్‌తోనే మరమ్మతులు చేయించాలి. సొంతంగా ప్రయత్నించొద్దు. స్టార్టర్ వైర్లు నేల మీద ఉంచకూడదు. స్టార్టర్లపై మూతతీసి వాడకూడదు. సర్వీసు వైర్లు, మోటార్లకు వాడే విద్యుత్ తీగలు నాణ్యమైనవి వాడాలి. అతుకులు లేకుండా చూసుకోవాలి. విద్యుత్ సబ్‌మర్సిబుల్ మోటారుతోపాటు విద్యుత్ వైర్ ఉంటుంది. ఏ కొంచం వైర్లు తెగి ఉన్నా, మోటార్ నుంచి పైన ఉండే వస్తువులకు విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఉంటుంది. ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే వెంటనే స్విచాఫ్ చేసి పొడవైన ప్లాస్టిక్ పైపు, కర్రతో వ్యక్తిని తప్పించాలి. తగిన వైద్య సహాయం అందించాలి.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రతి ఒక్కరూ విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి. పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదాల బారిన పడకుండా రైతులు విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్న జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ తీగలు తెగిపడినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. అలాంటి వాటిపై విద్యుత్ అధికారులకు వెంటనే సమాచారం అందించాలి. అన్నదాతలు సర్టిఫైడ్ ఎలక్ట్రిషియన్లతోనే విద్యుత్ పనులు చేయించుకోవాలి. స్టాటర్లు ఆన్, ఆఫ్ స్విచాఫ్ వేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.
– దినేష్, విద్యుత్ ఇన్‌చార్జి ఏఈ, సింహాద్రిపురం


విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన రైతు(ఫైల్)

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

లింగాల : మండలంలోని చిన్నకుడాల గ్రామంలో గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శంకర్‌రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకులు కళ్యాణ్‌రెడ్డిలు రాహుల్ గాంధీ పుట్టినరోజు కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

టీడీపీని మతతత్వ పార్టీగా మార్చే యత్నం

కడప వైఎస్ఆర్ సర్కిల్: టీడీపీని మతతత్వ బీజేపీగా మార్చేలా చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని డీసీసీ మాజీ అధ్యక్షుడు షేక్ నజీర్‌అహ్మద్ అన్నారు. కడప నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ముస్లింలో రోజూ ఐదు పూటలా నమాజు చేసే భంగిమల్లో యోగాసనాలు ఉన్నాయని, కొత్తగా అంతర్జాతీయ యోగా డే పేరిట ముస్లింలకు ఆపాదించేందుకు కుట్ర చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొనాలని బలవంత పెడుతున్నట్లు తెలుస్తోందని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ముస్లింలకు అండగా ఉంటానని చెప్పిన చంద్రబాబు ఇపుడు ముస్లింల వ్యతిరేక పార్టీతో జతకట్టడం తగదన్నారు.

మాట తప్పడం చంద్రబాబుకు పరిపాటిగా మారింది


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గాలిచంద్ర

జమ్మలమడుగు : కడపలో జరిగిన మహానాడు వేదికగా కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ జూన్ 12లోపు ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పి మాట తప్పాడని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర తెలిపారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ విభజన అనంతరం టీడీపీ అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి కడప ఉక్కు ఫ్యాక్టరీ పనులు చేపట్టలేదన్నారు. కేవలం ఎన్నికల సమయంలో మైలవరం మండలంలోని ఎం.కంబాలదిన్నె సమీపంలో ఉక్కు ఫ్యాక్టరీని నిర్మిస్తామని శంఖుస్థాపన చేశారు. ఇప్పటికైనా ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు గాలేరు–నగరి, హంద్రీ–నీవా తెలుగుగంగ, రాజోళి ప్రాజెక్టు పనులు పూర్తి కావడానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు వెంటనే నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం


కృష్ణారెడ్డిని ఊరేగింపుగా తీసుకెళుతున్న ఉపాధ్యాయులు

తొండూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాబోధనతోపాటు విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావడంలో విశేష పాత్ర పోషించిన ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డితోపాటు రాజశేఖరరెడ్డి, సరోజ, వాణిలు బదిలీపై వెళ్లారు. గురువారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డిని తోటి ఉపాధ్యాయులు భుజ స్కందాలపై మోసుకుంటూ ఊరేగింపుగా బస్టాండు వరకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి సేవలు పాఠశాలకు గొప్ప గౌరవాన్ని తీసుకొచ్చాయన్నారు. విద్యార్థుల మీద ప్రేమతో, సమర్ధవంతమైన బోధనతో ఎంతో మంది జీవితాల్లో మార్పు తీసుకొచ్చారని, ఇలాంటి ఉపాధ్యాయుడు ఏ పాఠశాలకైనా వరమేనని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ గ్రామంలోని విద్యార్థులతో గడిపిన సమయాన్ని జీవితాంతం మరిచిపోలేనని, విద్యార్థుల ప్రేమే నాకు పెద్ద బహుమతి అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి యోగా ఎంతో అవసరం


యోగాసనాలు వేయిస్తున్న రామకృష్ణారెడ్డి


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పులివెందుల : మానసిక వికాసానికి యోగా ఎంతో అవసరమని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో యోగాంధ్ర–2025 ఉత్సవాల సందర్భంగా యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డు అధ్యాపకులు రామకృష్ణారెడ్డి యోగాసనాల యొక్క ప్రయోజనాలను వివరిస్తూ వివిధ రకాల యోగాసనాలను విద్యార్థులతో వేయించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి రోజు ఇంటి పరిసరాలలో యోగాసనాలు చేయడంవలన శరీర దారుఢ్యాన్ని పెంచుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాలనారాయణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

వేంపల్లె : ప్రతిరోజు యోగా చేస్తేనే ఆరోగ్యం సిద్ధిస్తుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని గురువారం వేంపల్లెలోని స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో కరెస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, విద్యార్థులతో కలసి యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి వారు యోగాసనాలు వేశారు.

సింహాద్రిపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు నరసింహులు యోగాపై అవగాహన కల్పించడంతోపాటు యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ సతీష్ కన్నా, ఉపాధ్యాయులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

కమలాపురం : పట్టణంలోని బాలయోగి గురుకుల పాఠశాలలో ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ గౌస్‌బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు 11వ అంతర్జాతీయ యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలు, అన్ని శాఖల అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, సిబ్బంది హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వల్లూరు (చెన్నూరు) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 21న ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యోగ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. చెన్నూరు మండల వ్యాప్తంగా తొమ్మిది సచివాలయాలు ఉన్నాయని, ప్రతి సచివాలయ పరిధిలో 9 ప్రాంతాలలో యోగ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మండల వ్యాప్తంగా 9 సచివాలయాల పరిధిలో 81 ప్రాంతాలలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

వీరపునాయునిపల్లె : స్థానిక సంగమేశ్వర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 21వ తేదీన నిర్వహించే యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకధికారి మల్లికార్జున ప్రసాద్ తెలిపారు. యోగా కార్యక్రమం నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దాదాపు వెయ్యిమంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆమె కోరారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి 2 అనిత, మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, మండల రెవెన్యూ అధికారి లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని అన్ని సచివాలయాలలో జూన్ 21 ఉదయం 6.30 గంటల నుంచి 8.00 గంటల వరకు యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించాలని సచివాలయ కార్యదర్శులను ఆదేశించినట్లు ఎంపీడీఓ కుల్లాయిబాబు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలి

వేంపల్లె : ప్రైవేట్ పాఠశాలల్లో సామాన్య ప్రజల నుంచి వసూలు చేస్తున్న అధిక ఫీజులను రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా కో కన్వీనర్ దాదాపీర్‌లు డిమాండ్ చేశారు. గురువారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మొద్దు నిద్రలో నుంచి లేచి ప్రైవేటు పాఠశాలల అక్రమ ఫీజులపై చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ యాజమాన్యాలు అధిక ఫీజులను వసూలు చేసి పేదలను ఆర్థికంగా ఇబ్బందులకు నెడుతున్నారన్నారు. ఇష్టారాజ్యంగా పాఠశాలల యాజమాన్యం అధిక ఫీజులు వసూలు చేయడంతోపాటు పాఠశాలలోనే పుస్తకాలు విక్రయాలు చేస్తూ అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పెరటికోళ్ల పెంపకంతో రైతులకు ఆదాయం

కడప అగ్రికల్చర్: పంటలసాగుతోపాటు పెరటి కోళ్ల పెంపకం రైతులకు ఆదనపు ఆదాయాన్ని సమకూరుస్తుందని కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని ఊటకూరు కేవీకేలో పెరటికోళ్ల పెంపకంపై రైతులకు గురువారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవీకే నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని, శిక్షణ పొందిన తర్వాత ఆసక్తితో ఆచరణలోకి తీసుకురావాలని తెలియజేశారు. పెరటకోళ్ల పెంపకం ఆహార భద్రతను కాపాడుతుందన్నారు. పశు విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పెరటి కోళ్లలో వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు, టీకాల ప్రాముఖ్యత, యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. మహిళా రైతులు కోళ్ల పెంపకాన్ని ఉపాధిగా చూడాలని తెలిపారు. ఇందులో భాగంగా 500 కోళ్లను, కోళ్లకు సంబంధించిన మందులను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, సాయి మహేశ్వరి, మహేష్ బాబు, మానస, గిరిష్‌కుమార్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.

కేవీకే విద్యార్థులకు తల్లికి వందనం కొనసాగించాలి

కడప కోటిరెడ్డి సర్కిల్: కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు తల్లికి వందనం కొనసాగించేలా చూడాలని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, కడప మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రాకేష్‌లకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తమకు అమ్మఒడి వచ్చేదని, ప్రస్తుత ప్రభుత్వంలో తల్లికి వందనం రాలేదన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమ బిడ్డలకు న్యాయం చేయాలని తల్లిదండ్రులను వారు కోరారు. విద్యా శాఖ కార్యదర్శి కోనశశిధర్, డైరెక్టర్ విజయ రామరాజు, డీఈఓలతో శ్రీనివాసులురెడ్డి ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు.

ఎంఈఓ అవినీతిపై కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలి

పులివెందుల టౌన్ : పులివెందుల ఎంఈఓ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు వత్తాసు పలుకుతున్నారని ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ దినేష్‌కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ టీచర్ల బదిలీల సందర్భంలో ఇన్కమ్‌ట్యాక్స్ ఫైల్స్ చేసేటప్పుడు ఉపాధ్యాయులను బెదిరింపులకు గురిచేసి వారి వద్ద నుంచి బలవంతంగా వసూలు చేసినట్లు మండలంలోని కొందరు ఉపాధ్యాయులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారన్నారు. అదే విధంగా కనీస మౌలిక వసతులు లేకపోయినప్పటికీ పులివెందుల పట్టణంలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల నుంచి ఎంఈఓ పెద్ద మొత్తంలో ముడుపులు అందుకుని, వారికి అనుకూలంగా మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే విద్యా హక్కు చట్టాన్ని ఎంఈఓ కాలరాస్తున్నారన్నారు. పులివెందుల మండల పరిధిలో నాడు–నేడు పాఠశాలల్లో అధిక మోతాదులో అవినీతి అక్రమాలు జరిగాయని, గతంలో పనిచేసిన ఉపాధ్యాయులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారన్నారు. వీటన్నింటిపైన జిల్లా కలెక్టర్ స్పందించి పులివెందుల ఎంఈఓపై కమిటీ వేసి సమగ్ర విచారణ జరిపించాలన్నారు. లేకపోతే భవిష్యత్‌లో ఎంఈఓ అవినీతి అక్రమాలపై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు.

రక్త కణాలు తగ్గకుండా చూసుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ నిహారిక, వైద్య సిబ్బంది, విద్యార్థులు

వేంపల్లె : మనిషి శరీరంలో రక్త కణాల సంఖ్య తగ్గకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ నిహారిక తెలిపారు. గురువారం ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో వైద్య సిబ్బంది ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి సోకితే రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులో మారడం, తీవ్రమైన ఒళ్ళు నొప్పులు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లాంటివి ఉంటాయన్నారు. ప్రభుత్వాసుపత్రిలో రక్త పరీక్ష చేయించుకుంటే వెంటనే వ్యాధి నిర్ధారణ చేస్తారని, ఈ వ్యాధిని నివారించడానికి పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీ వున్నిసా బేగం, ఎంపీహెచ్‌ఈఓ ఫక్రుద్దీన్, హెచ్ఎం సుగుణమ్మ, స్టాఫ్ నర్స్ అరుణ, సీహెచ్ఓ రమాదేవి, ఆరోగ్య కార్యకర్త నాగస్వర్ణ, అంజన, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అభివృద్ధికి వార్డు మెంబర్లు సహకరించాలి

వేంపల్లె : గ్రామపంచాయతీ అభివృద్ధికి పాలకమండలి సభ్యులు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి మాధవరెడ్డి కోరారు. గురువారం పంచాయతీ కార్యదర్శి మాధవరెడ్డిని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ఆధ్వర్యంలో పంచాయతీ పాలక మండలి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను పంచాయతీ కార్యదర్శి దృష్టికి వార్డు సభ్యులు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈఓ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కార మార్గం చూపుతానని, శ్రీరామ్ నగర్‌లో కూడా నెలకొన్న తాగునీటి సమస్యలకు కూడా వెంటనే పరిష్కరిస్తానన్నారు. పంచాయతీలో పనిచేసే కార్మికులందరికీ త్వరలో జీతాలను పంపిణీ చేస్తామని, అందరి సహకారం ఉంటేనే పంచాయతీ అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలు కూడా సకాలంలో పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి


విద్యార్థులకు సూచనలు, సలహాలు అందజేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు


కమలాపురంలో మాట్లాడుతున్న సీఐ ఎస్‌కే రోషన్

జమ్మలమడుగు రూరల్ : విద్యార్థులు బాగా చదువుకుని తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు గురువులు చెప్పిన పాఠ్యాంశాలను క్రమశిక్షణతో విని ఉన్నత విద్యాభ్యాసము చదువులు చదవి ఉన్నతముగా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆయన సూచించారు. బిడ్డల కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతున్నారన్నారు. తల్లిదండ్రుల ఆశలను తీర్చవలసిన బాధ్యత తమపై ఉందని ఆయన అన్నారు. అనంతరం పట్టణ సీఐ ఎస్.లింగప్ప విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ చట్టాల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉంటుందన్నారు. నేడు పోటీతత్త్వం ఉందని, కావున విద్యార్థులు బాగా చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించి తమ తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఎస్ఐ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నత స్థాయికి ఎదగాలి

కమలాపురం : ప్రతి విద్యార్థి మంచి క్రమశిక్షణ అలవరచుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ఎ.విద్యా సాగర్ తెలిపారు. గురువారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల బాధ్యతా యుతంగా, మంచి పౌరులుగా ఎదగాలన్నారు. తల్లిదండ్రుల ఆశల్ని, ఆశయాలను నెరవేర్చేలా మీ వంతు కృషి చేసి విజయం సాధించాలన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థులు, యువతపై ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గుర్తించుకుని నడుచుకోవాలని సూచించారు. అలాగే పోక్సో యాక్ట్, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్–100, రహదారి భద్రత, సోషల్ మీడియా, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.